'కెమిస్ట్రీ ట్రిక్స్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

రామంతాపూర్: రామంతాపూర్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త జువ్వాది రమేష్‌బాబు ఇంటర్మీడియట్ విద్యార్థుల సౌలభ్యం కోసం రూపొందించిన 'కెమిస్ట్రీ ట్రిక్స్ అండ్ టిప్స్' అనే పుస్తకాన్ని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం కెమిస్ట్రీలో మెళకువలను పుస్తకం రూపంలో తీర్చిదిద్ది ఉచితంగా అందిస్తున్న రమేష్‌బాబు సేవలు ప్రశంసనీయమన్నారు.

కార్పొరేటర్ పర్యటన



ఉప్పల్ డివిజన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్: డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి పర్యటించారు. మంగళవారం పర్యటించిన ఆమె స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్ల సమస్య అధికంగా ఉందని స్థానికులు తెలిపారు. పాత కాలం నాటి తాగునీటి పైపులైన్లు ఉన్నాయిని వాటిని తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. జలమండలి మేనేజర్ సత్యనారాయణ, కాలనీ అధ్యక్షుడు నరసింహచారి, బాకారం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



రోడ్డుపై నిరసన చేస్తున్న స్థానికులు

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని మర్రిగూడ నుంచి అశోక్‌నగర్ వెళ్లే దారిలో ప్రమాదకరంగా రోడ్డుపై గుంతలు ఏర్పాడ్డాయి. గుంతలను పూడ్చాలని కోరుతూ మంగళవారం అశోక్‌నగర్ వాసులు ప్లకార్డులు పట్టుకుని ధర్నా చేపట్టారు. గతుకుల రోడ్డుతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌రెడ్డి, విక్టరీ జోష్ తదితరులున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

అల్వాల్: అల్వాల్ డివిజన్ లోతుకుంట బస్తీలో మంగళవారం కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి విద్యుత్ విభాగం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా లోతుకుంట బస్తీలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ వైర్లు, స్తంభాలను పరిశీలించారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు. విద్యుత్ విభాగం డీఈ సుబ్బారెడ్డి, ఏఈ రామాచారి, నరేష్, శేఖర్‌గౌడ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఇంటికి కూలిస్తే చస్తానంటూ..

పెట్రోల్ పోసుకున్న యువకుడు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ సర్వేనెంబర్–199 వీకర్ సెక్షన్ కాలనీలో రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణం పేరిట చేపట్టిన ఇంటిని కూల్చివేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాల ప్రకారం.. మహమ్మద్‌గౌస్, అశ్రిత్ బేగంలు గత 25 ఏళ్ల క్రితం ఓ ఇంటిని నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. కాగా సదరు ఇంటికి మరమ్మతు చేస్తుండగా స్థానిక కాంగ్రెస్ నేతలు వచ్చి రూ.3 లక్షలు డిమాండ్ చేశారన్నారు. డబ్బులు ఇవ్వకపోవడంతోనే అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారని బాధితులు ఆరోపించారు. ఇంటిని కూల్చేందుకు రెవెన్యూ సిబ్బంది జేసీబీని తీసుకురావడంతో ఆవేదనకు గురైన అశ్రిత్ బేగం కుమారుడు షానవాజ్ అధికారులను తమపై ఉసిగొల్పారని వాపోతూ.. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు నచ్చజెప్పడంతో విరమించుకున్నాడు. దీంతో రెవెన్యూ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లి పోయారు. ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్న తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఓజోన్ డే'

అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ డేను నిర్వహించారు. రసాయనశాస్త్ర విభాగం అధ్యక్షుడు డాక్టర్ అడవిరాజు, అధ్యాపకురాలు స్వాతిలు ఓజోన్ పొర తరుగుదల, దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు.

స్వచ్ఛతే లక్ష్యంగా..!



జీవీపీ పాయింట్ల వద్ద అవగాహన

- బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాల తొలగింపే ధ్యేయంగా..
- సీసీ కెమెరాల ఏర్పాటు, మైక్‌ల ద్వారా అవగాహన
- కౌన్సెలింగ్ ఇస్తామంటున్న అధికారులు

మల్కాజిగిరి: సర్కిల్ పరిధిలో జీవీపీ (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్) తొలగించడమే లక్ష్యంగా శానిటేషన్ అధికారులు పనిచేస్తున్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరిస్తేనే లక్ష్యాన్ని చేరుకుని స్వచ్ఛ భారత్, స్వచ్ఛ హైదరాబాద్ సాధ్యమవుతుంది.

- మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో నేరెడ్‌మెట్, వినాయకనగర్, మౌలాలి, మల్కాజిగిరి, గౌతంనగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్ తదితర డివిజన్లలో ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమం జరుగుతుతోంది. అనేక చోట్ల బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారవేస్తున్నారు. ఇలాంటి పాయింట్స్(జీవీపీ) గుర్తించి అక్కడ వ్యర్థాలను పారవేయకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రూ.2.5 లక్షలతో సీసీ కెమెరాల ఏర్పాటు

- ఇప్పటికీ సుమారు రూ.2.5లక్షలతో 25 పాయింట్ల వద్ద సీసీ కెమెరాలతో నిఘాను ఏర్పాటు చేశారు. ప్రతి సీసీ కెమెరా ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో మైక్ ద్వారా బహిరంగ ప్రదేశాల్లో



నిఘాకోసం సీసీ కెమెరా, మైక్‌సెట్

వ్యర్థాలు వేయకూడదని వేస్తే వేయి రూపాయల జరిమానా విధిస్తామన్న ఆడియోను నిరంతరం వినబడేలా చర్యలు తీసుకుంటున్నారు.

జరిమానా విధించినా నిర్లక్ష్యమే..

- చెత్త పారవేస్తే జరిమానా విధిస్తామని అధికారులు చెప్పుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితుల్లో 6 నెలల నుండి ఈ విధానం అమల్లోకి తీసుకుని వచ్చిన తర్వాత పదుల సంఖ్యలో కూడా జరిమానా విధించలేదు. రాజకీయ ఒత్తిళ్లు కూడా ఓ కారణంగా భావిస్తున్నారు. 90 శాతానికి పైగా ఈ విధానం సత్ఫలితాలు ఇచ్చిందని నెలకు సుమారు 50 టన్నుల చెత్త వేయకుండా చూడకల్గుతున్నామని అధికారులు చెబుతున్నారు. దశలవారీగా మిగతా ప్రాంతాల్లో కూడా సీసీకెమరాల నిఘా ఏర్పాటు చేస్తామంటున్నారు.

చెత్తను అందించని ఇళ్లకు రెడ్‌మార్క్



స్వచ్ఛ హైదరాబాద్‌కు ప్రజలు సహకారం అందించాలి. బహిరంగ ప్రదేశాల్లో (జీవీపీ పాయింట్స్) వద్ద చెత్త వేయకుండా ఆ ప్రాంతాల్లో స్లోగన్స్‌తో అవగాహన కల్పిస్తున్నాం. కాలనీ సంక్షేమ సంఘాలతో కలిసి ర్యాలీలు నిర్వహిస్తున్నాం. ఇంటింటికీ తిరిగి ఆటోల ద్వారా వ్యర్థాలను సేకరిస్తున్నాం. స్వచ్ఛ ఆటోలకు ఇవ్వని ఇళ్లను గుర్తించి రెడ్‌మార్క్ విధిస్తున్నాం. ప్రజలు ముందుకొస్తే మరిన్ని ప్రాంతాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తాం.

– శ్రీనివాస్ శానిటరీ సూపర్‌వైజర్

ప్రజల్లో కూడా మార్పు రావాలి



కేవలం అధికారుల వల్లే స్వచ్ఛ హైదరాబాద్ సాధ్యం కాదు. ప్రజల్లోనూ మార్పు రావాలి. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారవేస్తే ప్రజలకే నష్టం కలుగుతుంది. ఇంటింటికీ వచ్చు స్వచ్ఛ ఆటోలను సద్వినియోగం చేసుకోవాలి. మనతో పాటు కుటుంబం ఆరోగ్యం కాపాడుకోవడం కూడా ముఖ్యం. కొన్ని లోటుపాట్లను సరిచూసుకుని ఆయా ప్రాంతాల్లో తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి నిఘా ఉంచాలి.

– నాగరాజు, సామాజిక కార్యకర్త

ప్రహరీ నిర్మాణాన్ని నిలిపేయాలి



ఎంపీ ఈటలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఏసీపీ వెంకట్‌రెడ్డితో ఎమ్మెల్యే, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) మల్లాపూర్, నెహ్రూనగర్ వైపుగా నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణాన్ని నిలిపేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎంపీ ఈటల రాజేందర్, కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఎన్ఎఫ్‌సీ అధికారులను కలిశారు. నెహ్రూనగర్ వైపుగా గతంలో ఉన్న ఎన్ఎఫ్‌సీ ప్రహరీని తొలగించి మల్లాపూర్ గ్రామం సర్వే నెంబర్లు 43,44,45లోని ఖాళీస్థలంలో ప్రహరీ నిర్మాణ పనులను మొదలుపెట్టింది. సదరు స్థలం టీఎస్ఐఐసీకి చెందిన స్థలమని, నక్ష ప్రకారం కూడా టీఎస్ఐఐకి చెందినట్లుగానే ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజల అవసరాలకు వినియోగించుకునేలా చూడాలని కోరారు. స్థానిక నేతలు సాయిజెన్‌శేఖర్, లక్ష్మీనారాయణ, బాబు మాదిగ, చిన్న దుర్గయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు నిధులు మంజూరు చేయాలి



ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేత మునుగంటి రాంప్రదీప్

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, లక్ష్మీనగర్ కాలనీలోని శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ నేత రాంప్రదీప్ వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటికలో కనీసవసతులు లేక పూర్తి అపరిశుభ్ర వాతావరణం నెలకొందని ఆయన ఎంపీకి వివరించారు. ఎంపీ నిధుల నుంచి నిధులు మంజూరు చేయించి శ్మశానవాటికను ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఎంపీ ల్యాడ్ నిధుల నుంచి విడుదల చేయాలని సూచిస్తూ.. జీహెచ్‌ఎంసీ కమీషనర్‌కు లేఖ రాశారు. సకాలంలో స్పందించినందుకు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నేతలు బ్రహ్మాచారి, గోపు రాజేశ్వర్, జంగ బాలరాజు, సాయిపవన్, హర్షగౌడ్, శశికళ, దేవేందర్ తదితరులున్నారు.

దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నియోజకవర్గానికి చెందిన దేవాలయాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నేతలు మేకల రాముయాదవ్, హేమంత్‌పటేల్ పాల్గొన్నారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యపై..
నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేతలు మేకల రాముయాదవ్, తోట నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, హేమంత్‌పటేల్ పాల్గొన్నారు.

ఆర్‌కేపురం ఫ్లైఓవర్ పనులపై..
అల్వాల్: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి ఇలంబర్తిని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్‌కేపురం ఫ్లై ఓవర్ టెండర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలని, ఏవోసీ ప్రాంతంలో అదనపు రోడ్ల నిర్మాణం వేగంగా చేపట్టాలని, హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌లో ఉన్న కౌకూర్, మిర్జాలగూడ, మల్కాజిగిరిలో సమస్యాత్మకమైన సర్వే నెంబర్లను తొలగించాలని, ఏఎస్‌రావునగర్ నుంచి నేరెడ్‌మెట్ వరకు 100 ఫీట్ల రోడ్డు డీ–నోటిఫికేషన్ ప్రక్రియ చేపట్టాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలు త్వరలోనే తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. బీఆర్‌ఎస్ నేతలు మేకల రాముయాదవ్, హేమంత్ పటేల్ తదితరులున్నారు.

అభివృద్ధికి సహకరించండి

మౌలాలి: డివిజన్‌లో అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ గున్నాల సునీతాయాదవ్ మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని మిగతా డివిజన్లతో పోల్చుకుంటే మౌలాలికి నిధుల కేటాయింపులో పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బోడుప్పల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. చెంగిచర్ల 2వ డివిజన్ పరిధిలోని సప్తగిరిహిల్స్ కాలనీలో ఆమె మంగళవారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ.. కాలనీ పరిధిలోని సమస్యలను సత్వరం పరిష్కరిస్తానన్నారు. వీధి నెంబర్– 2లోని సీసీరోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానిక నేతలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ వీరాంజనేయ ఆలయంలో కమిటీ చైర్మన్ రాంరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ డైరెక్టర్లతో కలసి శరన్నవరాత్రి, బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ మేయర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ.. నవరాత్రి పండుగను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో దుర్గామాత ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావును కలిసి సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన పండుగకు కావాల్సిన సదుపాయాలను ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, పీఎంసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, అనంతరెడ్డి, బుచ్చియాదవ్, దుర్గా, అజయ్‌రెడ్డి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్

ఉప్పల్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, స్థానికంగా ఉండే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ సూచించారు. ఈ మేరకు డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానికులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. రూ. 55 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. సాయిరాంనగర్‌లో సీవరేజ్ పైపులైన్, బీరప్పగడ్డలో స్ట్రామ్‌వాటర్ డ్రైయిన్ పనులను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. దశలవారీగా అభివృద్ధి పనులను పూర్తిచేస్తున్నట్లు చెప్పారు.

ఆక్రమణలపై అధికారుల ఆరా

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ చిన్మయిమార్గ్ తదితర ప్రాంతాల్లో మంగళవారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ జకియాసుల్తానాతో పాటు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసులు, ఈఈ లక్ష్మణ్, ఏఈ దివ్యజ్యోతిలు పర్యటించారు. ఇటీవల మిర్జాలగూడ చిన్మయిమార్గ్, రాజానగర్, రాజశ్రీనివాస్‌నగర్, వెంకటాద్రినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాకాలంలో వరద నీరు రోడ్లపై చేరి ముంపునకు గురౌతుందని, రోడ్డు ఆక్రమణల వల్లే దశాబ్దకాలంగా ఈ సమస్య ఉందని కాలనీవాసులు ధర్నాతో పాటు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదుతో స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు జకియా సుల్తానా నేతృత్వంలో మంగళవారం చిన్మయిమార్గ్‌ను సందర్శించి రోడ్డు ఆక్రమణలపై ఆరా తీశారు. రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్మయిమార్గ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

తోటి విద్యార్థిపై దాడి.. కేసు నమోదు

మల్లాపూర్: నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తోటి విద్యార్థిపై మరి కొంతమంది విద్యార్థులు దాడిచేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. ఆగస్టు 29న 9వ తరగతికి చెందిన విద్యార్థి పుట్టినరోజున పాఠశాల వచ్చాడు. తరగతి గదిలో మరో ముగ్గురు స్నేహితులు 'బర్త్‌డే బంప్స్' అనే ఆట ఆడారు. దీనిలో భాగంగా ప్రైవేట్ భాగాలను మోకాలితో బలంగా కొట్టారు. కొంతమంది తనపై దాడి చేశారని సదరు విద్యార్థి వైస్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కుటుంబసభ్యులు పలు ఆస్పత్రులలో చికిత్స నిమిత్తం డాక్టర్‌ను సంప్రదించారు. పరీక్షించిన వైద్యులు మరో 3 నెలల పాటు విశ్రాంతి అవసరమని చెప్పారు. బాధిత విద్యార్థి తల్లిదండ్రులు దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యం వికటించి యువతి మృతి

ఆసుపత్రి ఎదుట బంధువుల ధర్నా



రేణికుంట్ల శైలజ (ఫైల్)

మల్లాపూర్: వైద్యం వికటించి యువతి మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాచారం ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాద్రాద్రి భువనగిరిజిల్లా, రాజపేట మండలం, చల్లూరు గ్రామానికి చెందిన రేణికుంట శైలజ (20) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. 13న ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు మొదటగా భువనగిరిలో చూపించారు. వైద్య పరీక్షలు చేయగా అపెండిసైటిస్ అని తేలింది. దీంతో భువనగిరి నుంచి నేరుగా నాచారం స్నేహపురి కాలనీలోని ఓ మల్టీస్పెషాల్టీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్ రక్తం ఎక్కించి, అనంతరం 14న అపెండిసైటిస్ ఆపరేషన్ చేశారు. పరిస్థితి విషమించడంతో ఉప్పల్‌లోని టీఎక్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ప్రాణాలకు హామీ ఇవ్వకపోవడంతో సికింద్రాబాద్‌లోని మెడికోవర్ ఆసుపత్రిలో చేర్పించారు. సోమవారం సాయంత్రం 7.30 గంటలకు యువతి మృతి చెందింది. అర్ధరాత్రి మృతదేహాన్ని తీసుకొచ్చి నాచారం స్నేహపురికాలనీలోని మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. మృతికి కారణమైన డాక్టర్, ఆసుపత్రిని సీజ్ చేయాలని మంగళవారం తెల్లవారుజాము 4 గంటల వరకు భీష్మించుకుని కూర్చున్నారు. ఆసుప్రతి యాజమాన్యం బాధిత కుటుంబానికి పరిహారం ఇస్తామని చెప్పడంతో ధర్నాను విరమించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

అల్వాల్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఎన్జీఓ సెల్ కన్వీనర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. మంగళవారం యాప్రాల్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, నేరేడ్‌మెట్ కార్పొరేటర్ మీనాఉపేందర్‌రెడ్డిలు హాజరై చిన్నారులకు బ్యాగులను అందజేశారు. సత్యనారాయణబాబు, ఆదిత్య, రమేష్‌గౌడ్, విజయలక్ష్మి, కుమారి, నవీన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఓ గోనే సంచిలో మహిళ మృతదేహాన్ని కుక్కి రైల్వేస్టేషన్ ఆటోస్టాండ్‌లో వదిలివెళ్లారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరించారు. కుళ్లిన దశలో భరించలేని దుర్వాసన వస్తుండటంతో 2–3 రోజుల క్రితమే మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్, క్లూస్ టీం బృందాలు ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని డీసీపీ పద్మజ, ఏసీపీ వెంకట్‌రెడ్డి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మరో కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు సుమారు 40 ఏళ్ల ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.